ఈ కథను తల్చుకున్నప్పుడల్లా నా గుండె నీరయి పోతుంది. ఒక నిండు ప్రాణం బలి అవటానికి నేనే కారకుణ్నేమో అనిపిస్తుంది. అందుకే కనిపించిన నా మిత్రులందరికీ ఈ కథను చెప్పి, ఇందులో నా పాపమేదయినా వుందా అని ఆదుర్దాగా అడిగాను. వాళ్లేవో సమాధానాలు చెప్పారు. కాని నాకు తృప్తి లేదు. మీకూ ఈ కథ చెప్తాను. మీరయినా నన్ను తృప్తి పరిచే సమాధానమిస్తారేమో చూస్తాను—

అసలీ కథ మావూళ్లో జరిగింది. అవి నేను మద్రాసులో మా మామగారితో కలిసి వ్యాపారం చేస్తున్న రోజులు. వ్యాపారంలో ప్రతి యేటా మంచి లాభాలు తీస్తున్నాను. కాని నాకు సుఖంలేదు. నా భార్యకు ఏదో జబ్బు. ఎన్నిరకాల వైద్యాలు చేయిస్తున్నా నయం లేదు. ఒక డాక్టరు కొన్నాళ్లపాటు గాలి మార్పు కావాలన్నాడు. అందుకని నా భార్యని తీసుకొని మా వూరు వెళ్లాను. మా వూరు విజయవాడకు దగ్గర్లో వున్న ఒక పల్లెటూరు. అక్కడ మా అమ్మ ఉంది. మా అమ్మని చూసినట్లుగా వుంటుందని బయలు దేరాను. మా వూరెళ్ళటానికి ఇంకో కారణం వుంది. విజయవాడలో మా బ్రాంచి నొకటి తెరవాలను కుంటున్నాం. ఆ పరిసర ప్రాంతాల్లోని మార్కెట్ను స్టడీ చేసి విజయవాడ మా వ్యాపారాని కనుకూలంగా వుంటుందో, లేదో చూడటం కూడ ఒక కారణం.

మా వూళ్లో నా బాల్యమిత్రుడు రంగారావు కలిశాడు. వాడు చాలా సరదా మనిషి. అందుకే మాకు స్నేహం కల్సిందేమో. నేను చదువాపేసిన తర్వాత నా పెళ్లయి మద్రాసు తరలివెళ్లేవరకు మావూళ్లోనే వున్నాను. అప్పట్లో రంగారావు, నేను కలిసి పైలా పచ్చీసుగా తిర్గాం. ఇప్పుడు రంగారావు మావూళ్లో కొంత భూములు చూసుకుంటున్నాడు.

నేనా వూళ్లో వుండగా రంగారావు ద్వారా పరిచయమైన వ్యక్తి శ్రీరంగం మాస్టారు. మావూరి ఎలిమెంటరీ స్కూలులో టీచరుగా చేస్తూ వున్నాడు. మనిషి ఎర్రగా, అందంగా చూడ్డానికి ఆడపిల్లలాగా వుంటాడు. నాటకాల్లో వేషాలు వేస్తుంటాడు. అతడే వూరు వచ్చిన తర్వాత మా వూళ్లో ఒక నాటక సమాజాన్ని స్థాపించాడు. అందులో మావూళ్లోని యువకులు చాలా మంది చేరారు. మా రంగారావు ఈ సమాజానికి కార్యదర్శి. వీళ్లు పొరుగూళ్ళకెళ్లి నాలుగయిదు ప్రదర్శనలిచ్చి పెద్దల ప్రశంసలు పొందారు కూడ.

— ఇదంతా ఈ కథకు ఉపోద్ఘాతం మాత్రమే! అసలయిన కథ నేనూ, రంగారావు నా కార్లో విజయవాడ నుండి తిరిగి వస్తున్న పున్నమరాత్రి మొదలవుతుంది. ఒక సాయంత్రం నాకు పనివుండి నా కార్లో విజయవాడ వెళ్తూ రంగారావుని కూడ వెంట తీసుకువెళ్లాను.

విజయవాడలో నా పని పూర్తయి మరల మా వూరికి మేం బయలు దేరేసరికి రాత్రి పన్నెండు గంటలు దాటింది. పని అంటే పెద్ద పనేమీకాదు. అక్కడ నాకొక మిత్రుడున్నాడు. వాణ్ని కలిశాం. వాడు మాకు డిన్నరిచ్చాడు. పసందైన పదునును, మేలిరకం పానీయాల్ని తెప్పించాడు. రంగడు రెండో దాన్ని, నేను రెండిట్ని ఓస్పు చేశాం.

మత్తుగా తీయగా వెచ్చగా కార్లో కూర్చుని మెత్తగా కారుని డ్రైవ్ చేసుకుంటూ మావూరి దారి పట్టాం.

పున్నమి వెన్నెల, అరగంట క్రితం నావళ్లో కూర్చుని నాకు యాపిల్ ముక్కలు తినిపించిన చిన్నది కట్టుకున్న చీరలాగా తెల్లగా వుంది.

నేను సిగిరెట్టు మీద సిగిరెట్టు కాలుస్తూ హుషారుగా ఏదేదో మాటాడేస్తూ రయ్మన డ్రైవ్ చేస్తున్నాను. జాగ్రత్తగా తోలరా బాబు (వాడు 'తోలరా' అనే అన్నాడు!) అంటూ రంగడు మధ్య మధ్యలో గొడవ జేస్తున్నాడు. వాడి భయానికి నాకు నవ్వు వచ్చింది. అనవసరంగా వాణ్ని కంగారుపెట్టటమెందుకని మెల్లగా డ్రైవ్ చెయ్యటం మొదలు పెట్టాను.

పున్నమి చంద్రుడు విసిరిన వెన్నెల వలల్లో చిక్కుకొని కదలక మెదలక నిశబ్దంగా వున్న ఆ సుందర ప్రకృతిలో, తీయటి మత్తులో వెచ్చగా కారు నడుపుకుంటూ ఎన్నివందల మైళ్లయినా అలా పోవాలని పిస్తుంది నాకు. కాని మావూరు దగ్గర పడింది. 18 మైళ్ల దూరాన్ని ఎంత నెమ్మదిగా పోయినా ఎంతసేపు పోతాం? అదిగో ఆ గట్టు మలుపు దాటితే మావూరు. ఆ గట్టు పేరు భోగం దాని గట్టు. ఎవరో జమీందారు ఆ గట్టుమీద ఒక భోగం దాని కొరకు బంగళా కట్టించి అందులో దాన్ని వుంచారట. అందుకే ఆ గట్టుకు ఆ పేరు వచ్చివుండాలి. ఆ బంగళా ఇప్పుడు పూర్తిగా శిథిలమైపోయింది.

ఆ గట్టు ఇంకా నాల్గు మైళ్ల దూరంలో వుంది. అనగానే రంగారావులో ఏదో సంచలనం మొదలయింది. ఇవాళ పౌర్ణం కదరా అని అడిగాడు. అవున్రా అని అన్నాను. అంతే! వాడు నా దగ్గరికి జరిగాడు నన్ను ఆనుకుంటూ కూర్చున్నాడు. మాటి మాటికి ముందుకు నిక్కి నిక్కి చూస్తున్నాడు. 'నన్ను కరుచుకుంటున్నావ్ చలిగా వుందా ఏమిటి' అని అడిగితే— కాదులే పోనీయరా బాబు అంటున్నాడు. తన వాచీతో టైం చూసుకున్నాడు. 'వంటిగంట అయిందిరా' అన్నాడు. 'మీనాన్న తంతాడని భయమా ఏమిట్రా' అని అడిగితే 'ఛా పోరా' అన్నాడు.

వాడు కర్చీఫ్ తీసి మొగం తుడుచుకున్నాడు. "అరె బ్రదర్, కారు కాస్త జోరుగా నడపరా!"— అన్నాడు.

"ఇప్పుడే కదరా మెల్లగా తోలరా అన్నావు. ఇప్పుడు మళ్లీ జోరు అంటున్నావు. అసలు సంగతేమిటి? ఇపుడు నీకు 'కిక్' యిచ్చిందా?" అని అడిగా ఇంకా స్లోచేస్తూ.

"పరాచికాలు కాదు. నీవు స్పీడ్ ఎక్కించు. నేను తర్వాత చెప్పుతాను. నా మాట విను—" అని ప్రాధేయ పడటం మొదలు పెట్టాడు.

వాడి పద్ధతి నాకేమీ అర్థం కాలేదు. వున్నంత సేపు వుండి ఈ ఆరు మైళ్ల దూరం వెళ్లేలోపల ఏం కొంపలు మునిగి పోతాయని? అంత అతివేగంగా యింటి కెళ్లి ఇంత అర్ధరాత్రి పీడెలగ పెట్టవల్సిన రాచ కార్యాలేమిటి? నాకేమీ అర్థం కాలేదు. అయినా వాడంత తొందర జేస్తున్నాడు కదా అని నేను స్పీడు రైజ్ చేశాను.

"మనం వూళ్లోకి వెళ్లేదాక ఎట్టి పరిస్థితిలోనూ నీవు మాత్రం కారు ఆపవద్దు—" రంగారావు హెచ్చరిక! వాడి వంక వింతగా చూశాను. వాడు మాత్రం రోడ్డు వంక చూస్తూ కూర్చున్నాడు.

వాడు నా భుజాన్ని గట్టిగా పట్టుకున్నాడు. మనిషి కాస్త వణుకు తున్నట్లని పించింది.

"అదిగో అటు చూడు—" బావి లోంచి మాటాడుతూ వున్నట్లుగా వుంది వాడి గొంతు.

అటే చూస్తున్నాను. ఏముంది? నల్లటి తారు రోడ్డు. ఒక వంతెన. వంతెన కటూ ఇటూ పెద్ద పెద్ద మర్రిచెట్లు. మరేవో చెట్లు. కంప. చీకటి నీడలు. చనిపోయిన ఏనుగు రోడ్డు కడ్డంగా పండుకున్నట్లుగా భోగం దాని గట్టు మలుపు తిరుగుతుంది....... ఆ — ఇంతలో వంతెన ప్రక్కనుండి ఒక ఆకారం— ఒక స్త్రీ— వచ్చింది. కారు ముందు వెళ్లుతుంది. ఆ స్త్రీ దగ్గరవుతుంది. ఆమె, కారు ఆపమన్నట్లు చేయి వూపుతుంది........

నేను బ్రేక్‌మీద కాలు వేయబోయాను. రంగారావు నా భుజాన్ని తన గుప్పిలిలో బిగించి పారేస్తున్నాడు.

"వద్దు, ఆపవద్దు. ఇంకా స్పీడెక్కించు— ఆపకు— డేంజర్— నా మాట విను— ఆపకు ఆపకు—" భయంతో గజగజ వణుకుతూ కంగారుగా అంటున్నాడు రంగారావు.

ఆ స్త్రీకి మాకు మధ్యన అర ఫర్లాంగు దూరముంటుంది. కారు హెడ్‌లైట్లకాంతి ఆ స్త్రీ ఆకారం మీద ఫోకస్ అవుతున్నది. ఆ ఆకారం స్పష్టంగా కనిపిస్తోంది. తెల్ల చీర, రవికా. నల్లటి బారు జడ పిరుదులను దాటుతుంది. తలనిండా మల్లెపూలో, మరే పూలో తెల్లగా మెరుస్తున్నాయ్. 19, 20 ఏళ్ళ కంటే ఎక్కువ వయస్సు వుండదు. 'పొంకమ్మైన వంటి బిగితో మాంచి వయస్సులో వున్న పడుచుపిల్ల. కారాపమని చేయి వూపుతుంది. కారాపి ఆ పిల్లను కారులో కూర్చో బెట్టుకొని ఎక్కడికయినా తీసికొని పోవచ్చు. కాని నా పక్కన ఈ శనిగాడొకడు. భయంతో వణికి చస్తున్నాడు. ఆపవద్దు ఆపవద్దని వూరికే పతాయింపు— అప శౌండు కాపమంటుందో ఏమో—

...... కొన్ని గజాలు మాత్రం మిగిలాయి. పిడికి కుండపోతగా చెమట కారుతుంది— వణి జ్వరం వచ్చిన వాడిలాగా గజగజ వణుకుతున్నాడు.

ఆ పిల్ల తీయటి గొంతుకతో, 'నన్ను కారు ఎక్కించు కోరూ?' అని అంటూ చేయి వూపుతుంది.

నా కాలు బ్రేక్‌మీద పడపోవటం రంగారావు కనిపెట్టి, 'దెయ్యంరా బాబూ—' అని అరచి కళ్లు గట్టిగా మూసుకున్నాడు. కారు ఆమెని దూసుకుని దాటి ముందు కెళ్లింది.

వెనక పకపకా నవ్వు— ఆ నిశ్శబ్ద వాతావరణంలో ఆపకోకుండా అలాటి వికృతపు నవ్వు వినగానే నా గుండె ఆగిపోయినట్లనిపించింది.

కారు గట్టు మలుపు తిరగబోతుండగా వెనక్కి తిరిగి చూశాను. రోడ్డుమీద ఎవరూ కనిపించలేదు. మెలికలు తిరిగిన నల్లటి తారు రోడ్డు వెక్కిరించి నట్లనిపించింది. ఆ స్త్రీ ఏమయింది? ఎక్కడికి పోయింది? మాయమయి పోయిందా? ఇదెలా సాధ్యం? కలా, మాయా?

* * *

రంగారావు యింటి దగ్గర్లోవున్న రామమందిరం ముందు కారాపాను. అప్పటికి రంగారావు కాస్త స్థిమిత పడినట్లున్నాడు. తాపీగా సిగిరెట్టు తీసి వెలిగించాడు. వాడయితే స్థిమిత పడ్డాడుగాని, నాలో పెద్ద సంచలనం రేగింది ఈ సంఘటన మూలంగా.

ఏమిట్రా సంగతి అని వాడ్ని అడిగితే వెంటనే చెప్తే చావడే? రేపు మాటాడుకుందాం లేరా అంటాడు. ఈ మిస్టరీ తెల్సుకోకుండా వెళితే ఈ రాత్రికి ఇక నాకన్ను మూత పడుతుందా? కాదు ఇప్పుడే చెప్పాలని పట్టు పట్టితే ఎట్టకేలకు నిక్కుతూ నీల్గుతూ సస్పెన్స్, టెంపో ఇత్యాదివి మెయిన్‌టెయిన్ చేస్తూ వాడు చెప్పింది ఇది:

ఆ స్త్రీ మానవాంగన కాదు. ఒక దెయ్యం. శ్రీరంగం మేష్టారి భార్య. ఆమె చనిపోయి ఇలా దెయ్యమయింది. ఆమె అసమాన్యమైన సౌందర్యవతి. ఆమె అంటే ఆయనికి ప్రాణం. ఆయనే ఆమె ప్రాణం! వాళ్ళు ఈ వూరొచ్చిన నాల్గు నెలలకి ఒకసారి ఆమె తన పుట్టింటికి వెళ్లింది. అలా వెళ్లి నామె మళ్లీ తిరిగిరాలేదు. అక్కడ అకస్మాత్తుగా పెద్ద జబ్బు పడింది. ఈయనికి కబురందితే శెలవు పెట్టి వెళ్లేసరికి ఆమె ఈలోకం నుండి తప్పుకుంది. జబ్బులో ఆమెకు సంధి పుట్టింది. ఆ సంధిలో భర్తకోసం విపరీతంగా పలవరించి, పలవరించి చనిపోయింది. భర్తకోసం అపరిమితమైన ప్రేమతో కొట్టుకులాడిపోయిన ఆమె జీవుడు చనిపోయిన తర్వాత ఇలా దెయ్యమయింది. ఆమె నిండు పున్నమి రోజున చనిపోయింది. ప్రతి పున్నమికీ ఆమె ఆ గట్టు అవతలవున్న వూడలమర్రి దగ్గర రాత్రి పన్నెండు దాటిన తర్వాత అలా కనిపిస్తుంది. ఆ రోడ్డున వచ్చే పోయే లారీలను, చిన్న కార్లను, "నన్నెక్కించుకోవూ—" అంటూ ఆపుతుంది. ఈ వుదంతం తెల్సిన వాళ్లెవరూ ఆపరు. ఆపలక్కడికి వచ్చేసరికి ప్రాణాలు బిగపట్టుకొని ఆరవై మైళ్ల స్పీడులో పోతారు. తెలియని వాళ్లు ఎవరైనా ఆపితే కారు ఎక్కకుండా ప్రక్కనున్న వూడల మర్రి ఎక్కి కూర్చుంటుంది. మళ్లీ సైకిలు వాళ్లను, ఎడ్లబండ్ల వాళ్లను ఆపదు. దూరంగా వూరికే కనిపించి ఏవో వికృతపు చేష్టలు చేస్తుంది. లేకపోతే వూరికే ఎక్కిఎక్కి ఏడుస్తూ వుంటుంది.

ఒక్కొ బస్సులను కార్లను లారీలనే ఆపటానికి కారణం వుంది. ఆమె చనిపోయే రోజు సంధిలో మంచం మీదనుండి లేచి బయటి రోడ్డుమీద కొచ్చి "మా వారి దగ్గరికి తీసికెళ్లండి, నన్ను కారెక్కించు కోండి—" అని కేకలు పెట్టుతూ ఏదిక పోయే కార్లను ఆపిందట.

ఇలా సంవత్సరం నుండి జరుగుతుందట. తెల్సిన వాళ్లెవరూ పౌర్ణమి రోజు పన్నెండు దాటిన తర్వాత ఆ రోడ్డునపోరు. తప్పని సరయి పోవాల్సి వస్తే ప్రాణాల్ని గుప్పెట్లో పెట్టుకొని భయం భయంగా పోతారు. ఆ ఆకారం నడిచినంతమేర చుట్టూ రెండు ఫర్లాంగుల దూరంవరకు మొగలిపూలు, మల్లె పూలు, సంపెంగపూలు వాసన కొట్టుతుందట. ఇదీ కథ!

నాకు దెయ్యాల మీద నమ్మకం లేదు. కళ్ళతో చూచిన తర్వాత నమ్మకేంజేస్తాను?

ఈ సంఘటన జరిగిన రెండు మూడు రోజుల తర్వాత శ్రీరంగం మేష్టారి భార్య ఫోటో చూడటం సంభవించింది. నాటకం రిహార్సల్ చూస్తానికి ఒక సారి రంగారావుతో ఆయనింటికి వెళ్లినపుడుచూశాను. నిజంగానే ఆమెది గొప్ప అందం! నేనెంతో మంది గొప్ప అందగత్తెలను చూశాను గాని, ఈమె అందములో ఒక విలక్షణమైన విశిష్టతేదో వుంది. పూర్వపు మహారాజుల అంతఃపురాల్లోని ఉద్దాంత స్త్రీల అందం! రాజ్యాలను కూల్చిన మహాసౌందర్యం! రాజాధి రాజులను పిచ్చెక్కించి బికారులను జేసిన లోకోత్తర సౌందర్యం! ఒక్కసారి చూస్తే జన్మ జన్మాలకు మర్చిపోలేని మనోహర రూపం ఆమెది!

అంత గొప్ప అందగత్తెయిన భార్య చనిపోయినా పిచ్చివాడు కాకుండా ఈ మాష్టారు నాటకాలెలా వేస్తున్నాడా అని పించింది.

ఆ రోజంతా కళ్ళు మూసినా తెరిచినా నా మనో యువనిక పయిన ఆ ముగ్ధ మోహన రూపమే సాక్షాత్కరించింది!

* * *

మావూరు వదలి ఒకవారం రోజుల పాటు మద్రాసు, నెల్లూరు, తెనాలి తిర్గి తిర్గి మళ్లీ ఆ రోజు కార్లో మావూరు బయలుదేరాను. తెనాలి నుండి విజయవాడ వచ్చేసరికి రాత్రి తొమ్మిది అయింది. మళ్లీ మా మిత్రుడ్ని కలసి వాడి ఆతిథ్యం తీసుకొని ఆ రాత్రికే యింటికి బయలుదేరాను.

లక్ష్మీటాకీస్ సెంటర్‌లో రంగారావు కనిపించాడు. వాడ్ని చూచి కారాపాను. నవరంగ్‌లో రెండో ఆట సినిమా చూసి వస్తున్నాడంట. ఆఖరి బస్సు తప్పి పోయేసరికి ఈ రాత్రికి ఇక్కడ ఆగిపోయి సినిమా చూచి ఏదయినా లాడ్జింగులో పండుకుందామను కున్నాడంట. లాడ్జింగులకోసం చూస్తూ నాకు కనిపించాడు. పదరోపోదాం పద కారెక్కు అన్నాను. వాడు వెంటనే కారెక్కటానికి సంకోచించాడు. వాడి గుంజాటన చూచి ఏమిట్రా ఫూల్ అని అడిగితే వాడు చెప్పిన సమాధానమిది!

"ఏం లేదురా బాబు, ఇవాళ కూడ పౌర్ణమే అయింది. ఆ మేష్టారి పెళ్లాం దెయ్యమై అక్కడ కూర్చొని వుంటుంది. నన్ను నీవు నవ్యంగా యింటికి జేరుస్తావా అని— నీ వెంట రావాలంటే భయం వేస్తుందిరా—"

నాకు నవ్వు వచ్చింది. వెంటనే రెండు రోజుల

క్రితం వెల్లూరులో నా మిత్రుడు రెడ్డి బంగళాలో చూచిన దృశ్యం గుర్తుకొచ్చింది.

"నీ కొచ్చిన భయమేమిలేదు. నిన్ను సురక్షితంగా ఇంటికి చేర్చే బాధ్యత నాది! రా— వచ్చికూర్చో—' అన్నాను.

మ్యాయిండియాలో రెండు స్ట్రాంగ్ టీ బిగించి బయలుదేరాం.

ఆకాశంలో నత్తుత్తుగా నక్షత్రాలు మెరుస్తున్నాయి. మెల్లగా క్రిందికి జారుతున్న పొగమంచుతో వెన్నెల దుమ్ము కొట్టుకు పోయినట్లుగా వెల వెలబోతుంది. కనిపించని చలి వణికిస్తుంది. రంగారావు తను కూర్చున్న వయిపు గ్లాస్ క్రిందకు దింపి నావయిపు గ్లాసు కూడ దింపమన్నాడు. చలిగా వుంటేనే సరదాగా వుంటుందని చెప్పి గ్లాస్ దింపలేదు.

రంగారావు నాటక సమాజం గురించి ఏవో చెప్తున్నాడు. మధ్యలో స్పీడు తొక్కరా అని అన్నాడు. వాడు అనటమే తడువుగా ఏక్సిలేటర్ త్రొక్కాను. కారుస్పీడుతో ముందుకు దూసుకు పోతుంది.

మా వూరు దగ్గరవుతున్నకొద్దీ మా వాడిలో మామూలు సంచలనం మొదలయింది. నా దగ్గర దగ్గరకు జరుగుతున్నాడు. నా భుజాన్ని తన గుప్పిటతో పిండి పారేస్తున్నాడు. అంత చలిలోనూ వాడికి చెమట కారుతుంటే నాకు బలే నవ్వు వచ్చింది. నా నవ్వుచూచి వాడు కోపగించుకున్నాడు.

చోగందాని గట్టుమీద పొగమేఘాలు గుంపులుగా క్రిందకు దిగుతున్నాయి. వూడల మర్రి చుట్టూ చీకటిని దింపుతుంది. కారు వెలుగు నల్లటి తారు రోడ్డును మింగేస్తుంది. వంతెన...... కారును చూచి ప్రక్క డొంకలోంచి తెల్లచీర కట్టుకున్న ఆకారం రోడ్డు మీదకు వచ్చింది— చేయి చాచి కారు ఆపమంటుంది—

వద్దురా— ఆపకు— ఇంకా స్పీడు త్రొక్కు—

నన్ను కారెక్కించుకోవూ

అని రంగారావు వణుకుతున్న కంఠంతో నన్ను హెచ్చరిస్తున్నాడు. ఆపనులేరా అని చెప్తుంటే నా గొంతు నాకే వికృతంగా వినిపించింది.

కారుకు ఆ ఆకారానికి మధ్యనున్న దూరం తొందర తొందరగా తరిగిపోతుంది. కారు వెలుగులో ఆ ఆకారం స్పష్టంగా కనిపిస్తోంది. ఆ యువతి ఎంతో అందంగా వుంది.

కారుకూ వంతెన ప్రక్కన నిలబడ్డ ఆ యువతికీ మధ్య వున్న దూరాన్ని ఒకమారు చూశాను. కళ్ళు మూసుకొని లెక్కవేశాను— ఒక వంద గజాలున్నట్లుగా మనస్సుకు తట్టింది— రంగారావు వంక చూశా— నన్ను అంటుకుపోతున్నాడు—...... స్టీరింగ్ మీద కుడిచేయి తీసి డోర్ మీద పెట్టాను.... ముప్పై గజాల దూరం....... ఆ స్త్రీ చేయి చాచి క్రిందకీ మీదకూ వూపుతుంది......

బ్రేకుల మీద కాళ్ళు పెట్టి గట్టిగానొక్కా...... తారు రోడ్డుమీద, చక్రాలు 'కర్'న శబ్దంచేస్తూ, కారు కచ్చితంగా ఆ స్త్రీ ముందు ఆగింది— కారు ఆగటం, నేను ఆ స్త్రీ చేయి గట్టిగా పట్టుకోవటం, ఆమె కెవ్వున అరవటం— అన్నీ ఒక రెప్పపాటు కాలంలో జరిగాయి. వెంటనే మా రంగారావు, 'చంపావురా' అని కేకపెట్టి సీట్లో వరిగిపోయాడు.

ఈ అలజడికి వూడల మర్రిమీద పక్షులు ఒక్కసారి గోలగా లేచాయి.

నా చేతిలో ఆ యువతి చేయి మెలికలు తిరుగుతుంది. నేను డోర్ తీసుకుని క్రిందకు దిగాను. ఆమె తన శక్తినంతా వినియోగించి విడిపించుకోవటానికి తెగ గుంజుకుంటుంది. కాని లాభం లేకపోయింది.

కారు లైట్ల వెలుగులోకి లాగి ఆమెనుచూశాను.

వండర్— ఆడదికాదు! ఆడవేషంలో వున్న మొగవాడు!!

"అరే పిరికి వెధవ. కారు దిగిరారా— ఈ పగటి వేషం— సారీ, ఈ రాత్రి వేషగా డెవడో చూద్దువు గాని రా—" అన్నాను.

"ఏమిటి, వేషమా?" అంటూ రంగారావు కారు దిగి వచ్చాడు. వచ్చి చూచి ఆశ్చర్యపోయాడు.

"ఎవ్రడావీడు?" అని రంగారావుని అడిగాను.

రంగారావు కూడ పోల్చుకోలేక పోయాడు. ఏమోరా అన్నాడు. వీడ్నే అడిగితేపోలా— అని "ఎవ్రడానివ్?" అని అడిగా. సమాధానం లేదు. రాత్రుళ్ళు ఆడవేష మేసుకొని, దెయ్యంలాగా వచ్చే పోయే జనాన్ని దడిపించి చంపుతున్న ఆ రాస్కెల్‌ను చూడగానే నా కెక్కడలేని కోపం ముంచుకువచ్చింది. పళ్ళు పట పట కొరుకుతూ మెడ మీద ఒక్కటిచ్చాను. ఆ దెబ్బకు 'అమ్మో!' అన్నాడు బాధగా.

"ఆవిగ్ లాగరా— తెల్సిపోతుంది—" అని అంటూ రంగారావు ఆ పెట్టుకున్న జడను పట్టుకుని లాగాడు.

వండర్. మా కళ్ళను మేం నమ్మలేకపోయాం. శ్రీరంగం మేష్టారు!

ఆయన్ని చూడగానే నా చేతిపట్టు సడలిపోయింది.

శ్రీరంగం మేష్టారు వంతెన దగ్గర కూలబడి రెండు కాళ్ళసందున తల పెట్టుకుని భోరు భోరున ఏడుస్తున్నాడు. ఆ నిశబ్ద నిశీధిలో ఆయన ఏడ్పు హృదయ విదారకంగా వుంది.

రంగారావు ఆయన్ని ఓదార్చటానికి ప్రయత్నిస్తున్నాడు. నేను సిగిరెట్టు వెలిగించి తల రుద్దుకుంటూ అటూ ఇటూ పచార్లు చేశాను.

కొద్ది సేపుకు మాష్టారి ఏడ్పు ఉధృతం తగ్గింది. ఏడ్పు ఎక్కిళ్ళుగా మారింది.

"ఏమిటి మాష్టారు? ఈ ఆడవేషం— ఇలా దెయ్యంలాగా అందర్నీ దడిపించటం— నాకేం అర్థం కావటంలేదు—" రంగారావు మెల్లగా అనునయంగా అడుగుతున్నాడు.

ఆయన వస్తున్న దుఃఖాన్ని దిగ్రమింగుకుంటూ అన్నాడు: "అదే నారాజీ చనిపోయింది కదా!— అలా చనిపోయింది దెయ్యమయి—"

"ఆగండి మాష్టారు—" అని ఆయన చెప్పబోయేదాని కడ్డు తగిలాను. మేష్టారు, రంగారావు తలెత్తి నా వంక వింతగా చూశారు.

సిగిరెటు క్రిందపారేసి బూటుకాలుతో నలుపుతూ అన్నాను: "మీ భార్య చనిపోయిందా? దెయ్యమయిందా? ఇదొక పెద్ద అబద్ధం— ఆమె నట్నాలల్లో రంగేళి రవ్వలాగా అవలీలగా తలలు మార్చి పారేస్తుంటేను. రెండు రోజుల క్రితం వెల్లూరులో చూశా— మారెడ్డి బంగళాలో. నిదానంగా, వివరంగా చూద్దామనుకునే సరికి కారులో వెళ్ళిపోయింది. అప్పుడే నా కనుమానం తట్టింది. ఈ దెయ్యం గియ్యం అనేది ఒక పెద్ద కట్టు కథ అని. ఇప్పుడు తెలిసింది ఈ కట్టుకథకు నాయకుడు మీరని—"

శ్రీరంగం మేష్టారు మళ్ళీ కుళ్ళి కుళ్ళి ఏడ్చాడు. "మీకు తెల్సిపోయింది— అంతా తెల్సిపోయింది— లాభం లేదు— అంతా చెప్పేస్తా—" అని అన్నాడు వెక్కుతూ—

ఆయన చెప్పినదాన్నిబట్టి తేలింది ఇది—

మాష్టారి భార్య రాజేశ్వరి గొప్ప అందగత్తె



"—పార్టీ టిక్కెట్టు ఇవ్వనప్పుడు ఎంత స్వార్థరహిత సేవచేసి మాత్రం ఏమిలాభం?"

తల త్రిప్పుకోలేని ఆ అందం ముందు ఇతను తల వంచాడు. దాసానుదాసు డయ్యాడు. చాలాగొప్పగా ప్రేమించాడు, కాదు ఆరాధించాడు. తన ప్రేమకు, ఆరాధనకు ప్రతిఫలంగా ఆమెనుండి అతను పొందింది నిరాదరణ, నిరసన మాత్రమే! ఆమెకు తను గొప్ప అందగత్తెనని తన అందానికి ఇతను ఏవిధంగాను తగడని తెలుసు. ఆమెకు విలాస జీవితంమీద మోజు మెండు. ఈ బడిపంతులు తన విలాసాలను తీర్చ లేడని కూడా తెలుసు. అతనితో వున్న సంవత్సర కాలంలో అతనితో ఏనాడూ తృప్తి పడలేదు. తన అందానికి ఇది తగిన చోటుకాదనుకుంది. తనలో రగిలే లాలసకు ఇతను తగినవాడు కాదనుకుంది. అందుకే పుట్టింటికి వెళ్ళిపోయింది. పుట్టింటికి వెళ్ళిన భార్య రెండు నెలలైనా తిరిగి రాకపోయే సరికి ఆమెను చూస్తానికి, తన వెంట తీసుకు రావటానికి వెళ్ళాడు. వస్తుతః దరిద్ర దేవతకు నిలయమైన తన పుట్టింటిని ఈ రెండు నెలల్లో ఆమె తన అందచందాల ప్రభావంతో లక్ష్మికి ఆలవాలం చేసింది. ఆమె క్రీగంట చూపుకు తహ తహలాడే రసిక పురుషు లెందర్నో చూశాడు. ఆమె ఆ జీవితాన్ని వదులుకుని తనతో రాదని తెలిసి కూడ, ఇంటికి తిర్గి రమ్మని అడిగాడు. అందు కామె నవ్వింది. అతను ప్రాధేయపడ్డాడు. నీకు నాకు రాంరాం అంది. చేసేదిలేక తిరిగి వచ్చాడు. అప్పటికే గుచ్చి గుచ్చి అడుగుతున్న వూరివారిని నమ్మించటానికి ఒక కట్టు కథను సృష్టించాడు. తన భార్య జబ్బుచేసి చచ్చిపోయిందని చెప్పాడు. తను కల్పించిన కట్టుకథను గట్టిగా నమ్మించ టానికి ఒక దెయ్యాన్ని సృష్టించాడు. ఆ దెయ్యం తనే అయ్యాడు. అలా అవటంతో తనలోని ఒక విచిత్రమైన "మేనియాని" చల్లార్చుకోవటానికి ప్రయత్నించాడు. తను ఇంతగా ఆరాధించిన భార్య, తనని నిర్దయగా తృణీకరించి పాప కూపంలోకి దిగబడిపోతున్న తన భార్య, పెద్ద జబ్బు చేసి చని పోయిందని— చనిపోయి తన మీద మమకారం చంపుకోలేక తనకోసం దయ్యమయిందని— తను తాను నమ్మించుకోవటంలోను, వూరి వారిని నమ్మిం చటంలోను అతని కేదో తృప్తి, ఓదార్పు. అలా వెల కొన్నాడు— శిల్పమిచ్చాడు— ఏ రోజున్నైతే తన భార్య నీచ జీవితాన్ని తను కళ్ళారా చూశాడో, ఏరోజున్నైతే తన భార్య తన ముఖాన్ని ఈ జీవితంలో తనకు చూపించవద్దని ఆదేశించిందో, ఏరోజునైతే తనలో అశాంతి మంటలురేగి తనని నిలువున దహించ చేస్తాయో ఆ రోజున ఆడదవుతాడు, దయ్యమవుతాడు. వూరి వాళ్ళను బెదిరించి— తన తోవలివాడు హృదయ విదారకంగా ఏడుస్తూంటే — తను పైకి నవ్వుకుంటాడు.

తన ఈ 'మేనియాని' ఇలా తీర్చుకొనివుండక పోయినట్లయితే తను ఏనాడో ఆత్మహత్య చేసు కొని వుండేవాడు!

అతన్ని పూర్తిగా వశంచేసుకున్న ఆ 'మేనియాని' అలా కొనసాగించు కోవటానికి నావల్ల అవరోధం కలిగింది. కాబట్టే శ్రీరంగం మాష్టారు తెల్లారే పాటికి వూరల మర్రికి వురిపోసుకుని చనిపోయాడు.

అతని చావుకు నేనెంతవరకు బాధ్యుణ్ణి అని నేను ఈ రోజువరకు ఆలోచిస్తూనే వుంటాను. మరి మీరేమంటారు? ●

MTP-1-P-1-65/66 TL